మాట్లాడుతున్న డిఆర్ఓ వెంకట నారాయణమ్మ

ఎన్‌టిఆర్ వైద్య సేవలో...

పైసా వసూల్..!

- రోగుల నుంచి వేల్లలో వసూలు చేస్తున్న నెట్‌వర్క్ ఆస్పత్రులు
- జిల్లా కలెక్టర్ హెచ్చరికలు బేఖాతర్
- మామ్ముళ్ల మత్తులో అధికారులు

> కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెకు సంబంధించిన ఆధునిక స్టంట్ శస్త్ర చికిత్స కోసం అంటూ ఎన్టీఆర్ వైద్య సేవ కింద చేరిన రోగి నుంచి సుమారు రూ.80 వేలు వసూలు చేశారు. దానికి సంబంధించి ఎలాంటి రశీదు ఇవ్వలేదు.
>
> - కర్నూలు బుధవార పేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో ఎన్‌టిఆర్ వైద్య సేవ రోగి నుంచి రూ.70 వేలు అదనంగా వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఉచితంగా చికిత్స పొందాల్సిన రోగుల నుంచి ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు వేలు, లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నా మామూళ్లకు అలవాటు పడిన అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి..

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఎన్‌టిఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) రోగుల నుంచి అదనపు వసూళ్ళు జరగకూడదని ప్రభుత్వాధినేతలు, అధికారులు పదేపదే చెబుతున్నా ఆచరణలో అది పూర్తిస్థాయిలో అమలవడంలేదు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 99 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో 55 ప్రయివేటు ఆస్పత్రులు కాగా మిగతావి ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. ఎన్‌టిఆర్ వైద్య సేవ అనుబంధ ప్రైవేట్ ఆసుపత్రుల్లో (నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో) రోగుల నుంచి అనధికారిక వసూళ్లు చాపకింద నీరులా సాగుతున్నాయి. నాణ్యమైన చికిత్స అందించేందుకు, ఆధునిక పరికరాలను అమర్చేందుకు అదనంగా రుసుములు చెల్లించాల్సిందేనని ఆసుపత్రి సిబ్బంది తెగేసి చెబుతున్నారు. దీంతో భయపడి రోగులు వారడిగిన మొత్తాన్ని చెల్లిస్తున్నారు. ఈ చెల్లింపులకు ఎక్కడా బిల్లులు ఇవ్వడంలేదు. కొన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోగ నిర్ధారణకు ముందు టెస్టుల పేరుతో రూ.రెండు వేల నుంచి రూ.8 వేల దాకా వసూలు చేస్తున్నాయి. జొహరాపురం రోడ్డులో ఉన్న ఒక హాస్పటల్లో ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో చేయాల్సిన కొన్ని ఆపరేషన్లను కూడా వైద్య సేవలో లేవంటూ భారీగా నగదు ఒక వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొత్త బస్టాండ్ దగ్గర గల శ్రీబాలాజీ యశోద హాస్పటల్‌లో ఆరోగ్యశ్రీ పేరుతో గర్భిణీలను జాయిన్ చేయించుకుని డెలివరీ చేయడం కోసం డబ్బులు వసూలు చేస్తునారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా ప్రధానంగా గుండె శస్త్ర చికిత్స, ఆర్థోపెటిక్, కంటి శస్త్ర

చికిత్సలు, డెలివరీ, జనరల్ మెడిసిన్ వంటి అనేక రోగాలకు ఎన్టీఆర్ వైద్య సేవ యిచ్చే డబ్బులు కాదని అదనంగా పేషంట్ల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. రోగుల నుండి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్న జిల్లా కలెక్టర్ హెచ్చరిలను బేఖాతర్ చేస్తున్నారు. వీటిని కట్టడి చేయాల్సిన ఎన్టీఆర్ వైద్య సేవ అధికారులు ఆస్పత్రుల నుంచి మామూళ్లు తీసుకుంటూ ఆ ఆస్పత్రులకు వత్తాసు పలుకుతున్నారని తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల అండతో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు విచ్చలవిడిగా వైద్య పరీక్షలు మొదలుకొని చికిత్స వరకు పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తూ వ్యాపారమే ధ్యేయంగా పని చేస్తున్నాయని బహిరంగంగా చర్చ సాగుతోంది. కర్నూలు నగరంలోని ఓమ్ని ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ రోగి నుంచి అదనంగా రూ.70 వేలు వసూలు చేసారని ఆ నగదును ఆన్‌లైన్‌లో బదిలీ చేసినట్లు రుజువు ఉందని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ విషయాన్ని వైద్య సేవ అధికారుల దృష్టికి తెచ్చినా ఎలాంటి విచారణ చేయలేదని చెబుతున్నాయి. వీటిని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారిపై ఏలాంటి చర్యలు లేవని విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారుల వెంటనే స్పందించి వీటిని అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

సంతకాలు పెట్టిస్తూ..!

ఆసుపత్రుల నుంచి వెళ్లిపోయే సమయంలో చికిత్స సంతృప్తికరంగా సాగిందని, డబ్బు వసూళ్లు జరగలేదన్న అంగీకారపత్రంపై సంతకాలు పెట్టి ఇళ్లకు వచ్చిన రోగుల నుంచి ఐవీఆర్ఎస్‌తో పాటు ఏఎన్ఎంలు అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఈ సమయంలో కొందరు ఆసుపత్రుల్లో అనధికారికంగా వసూళ్లు జరిగాయని, బిల్లులు ఇవ్వలేదని చెబుతున్నారు. ఎన్‌టిఆర్ వైద్యసేవలో డబ్బుల వసూళ్ల గురించి వివరణ తీసుకునేందుకు డిఎంహెచ్ఓను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

డబ్బులు వసూలు చేశారు

మా కూతురికి ఆరోగ్య శ్రీలో ఉచితంగా డెలివరీ చేస్తామంటే కొత్త బస్టాండ్ దగ్గరలోని శ్రీబాలాజీ యశోద ఆస్పత్రిలో చేర్పించాం. కానీ మా దగ్గర నుంచి రూ.16 వేలు వసూలు చేశారు. మందులకు అదనంగా డబ్బులు వసూలు చేశారు. మాకు ఏ మాత్రం రసీదు ఇవ్వలేదు. ఆరోగ్యశ్రీ ఉచితంగా అంటున్నారు కానీ ప్రైవేట్ ఆసత్రులు రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయి.

- సి.గురు శేఖర్, కర్నూలు.

ఫిర్యాదు చేసినా ఏ మాత్రం పట్టించుకోలేదు

ఆరోగ్యశ్రీ పేరుతో పేషెంట్లను జాయిన్ చేయించుకుని వివిధ రకాల జబ్బులకు ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రులలో వేలలో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఓమ్ని హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ పేషెంట్ నుంచి రూ.70 వేలు వసూలు చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ మాత్రం పట్టించుకోలేదు.

- శ్రీనివాసులు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఎన్టీఆర్ వైద్య సేవ పేరుతో ఉచితంగా వైద్యం అందిస్తామని ఊరూరు తిరిగి పేషెంట్లను ఆస్పత్రికి తీసుకొని వచ్చి పరీక్షల పేరుతో, మెరుగైన వైద్యం పేరుతో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. రోగుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్వయానా జిల్లా కలెక్టర్ హెచ్చరించిన ఏ మార్పు లేదు. వీటిని అరికట్టాల్సిన ఎన్టీఆర్ వైద్య సేవ అధికారులు మమ్ముళ్ల మత్తులో మునిగి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలి.

- వై నగేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

అక్షరాస్యతలో అగ్రగామిగా నిలపాలి

- డిఆర్ఓ వెంకట నారాయణమ్మ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోనీ నిరక్షరాస్యులు అందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్ది కర్నూలు జిల్లాను అక్షరాస్యతలో అగ్రగామిగా నిలపాలని డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ తెలిపారు. బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్‌లో వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో 'ఉల్లాస్' కార్యక్రమం అమలుపై డిఆర్ఓ జిల్లా స్థాయి కన్వర్జెన్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. డిఆర్ఓ మాట్లాడుతూ 'ఉల్లాస్' కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గత ఏడాది 'ఉల్లాస్' కార్యక్రమం మొదటి స్పెల్‌లో 28 వేల 872 మందికి గాను 27 వేల 200 మంది ఎఫ్ఎల్ఎన్ఎ (ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసి అసెస్మెంట్ టెస్ట్) కి హాజరయ్యారన్నారు. అందులో 25 వేల 257 మంది సక్సెస్ అయ్యారన్నారు. అదే విధంగా ఈ ఏడాది 30, 005 మందికి అక్షరాస్యతను నేర్పించాలని లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. అర్బన్ లో 50 శాతం రూరల్ లో 50 శాతం మందిని గుర్తించాలని, వారిని గుర్తించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ డిఆర్‌డిఎ, మెప్మా అధికారులను ఆదేశించారు. వయోజన విద్య శాఖ డిడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 2025-26లో జిల్లాలో మొత్తం 30,005 మందికి అక్షరాస్యతను నేర్పించాలని లక్ష్యంను నిర్దేశించామన్నారు. ఉల్లాస్ కార్యక్రమం మే5 నుంచి నుంచి సెప్టెంబర్ వరకు అక్షరాస్యత నేర్పించే కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో సమాచార శాఖ ఉప సంచాలకులు కె.జయమ్మ, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, డిఆర్‌డిఎ ఎపిడి శ్రీధర్ పాల్గొన్నారు.

పిఎన్ఎం కళాకారుడు మద్దూరు రామచంద్రుడు మృతి

నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

ప్రజానాట్యమండలి కళాకారుడు, సిపిఎం సీనియర్ సభ్యుడు మద్దూరు రామ చంద్రుడు అనారోగ్యంతో మరణించా రు. ఆయన భౌతిక కాయానికి సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారా యణ, పార్టీ సీనియర్ నాయకులు కె.నాగిరెడ్డి. టి.వీరన్న. సిపిఎం మండల కార్యదర్శి కామర్తి రాజు,

రామచంద్రుడు

చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మన్న. సిపిఎం మండల నాయకులు గపూర్‌మియా, పార్టీ సభ్యులు శ్రీరాములు, మునుస్వామి, వెంకటేష్ కలిసి రామచంద్రుడుకు నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ మద్దూరు రాముడు మొదటినుంచి సిపిఎంలో బాగా పని చేశారు. ప్రజానాట్యమండలిలో తనదైన శైలిలో పాటలు పాడడం, కళా రూపాలలో ఉండడం నటించడం మంచి ఆసక్తితో పనిచేశారు. అనంతరం కుటుం బ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ పరామర్శించారు.

సభనా..! సంతనా...?

- జనరల్ బాడిలో నియమాలు పాటించని అధికారులు
- కోడుమూరు ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాశక్తి- సి బెళగల్

సి బెళగల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జనరల్ బాడిలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జనరల్ సమావేశంలో అధికారులు సంయవనం పాటించకుండా హాలులోకి అలా వస్తూ, ఇలా బయటకు పోతూ సభకు భంగం కలిగించేలా నియమాలు పాటించక ఇస్టారాజ్యంగా వ్యవహరించారు. ఇక్కడే చివర్లో ప్రసంగించిన ఎమ్మెల్యే సభ అనుకున్నారా... సంత అనుకున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే నివేదికలు తీసుకురాకుండా వచ్చిన అధికారులపై ఆశామాషిగా హాజరు కావడం ఏంటని ప్రశ్నించారు. ప్రతి జనరల్ బాడీకి పోలకల్, సి బెళగల్ ప్రజారోగ్య వైద్యులు గైర్హాజరు కావడం సరైనది కాదని అన్నారు. ఇది ప్రజావేదిక అని నిబద్ధతతో హాజరు కావాలని, అగౌరవ పరచకూడదని తెలి పారు. ప్రజలకు అవసరమైన సేవలు సులువు మార్గంలో అందించాలని కోరారు. విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తిం చాలని సూచించిన అనంతరం ఆయా వినతులను స్వీకరించారు. ఎంపిడిఒ రానెమ్మ, తహసీల్దార్ పురుషోత్తం, మండల స్థాయి అధికారులు, సహచర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

30 ఏళ్లయినా పూర్తి కాని ముద్రణాలయం

- 2 ఎకరాల్లో నిలిచిపోయిన నిర్మాణాలు
- రూ. కోట్ల ప్రజాధనం వృథా
- సూపరింటెండెంటుకు పిపిఎస్ఎస్ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరం సీతారామనగర్ లో ఐదెకరాలకు పైగా విస్తీర్ణంలో.. ఎంతో చరిత్ర ఉన్న ప్రాంతీయ ముద్రణాలయ గోడౌన్లు శిథిలావస్థకు చేరాయని పట్టణ పౌర సంక్షేమ సంఘం(పిపిఎస్-ఎస్) నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, సివి రమణ, ఎస్.మొద్దీన్, ఎండి. ఇనూస్, ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులను, ప్రజాధనాన్ని కాపాడాలనే పిపిఎస్ఎస్ పిలుపుమేరకు బుధవారం అసంపూర్తిగా ఉన్న ప్రాంతీయ ముద్రణాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాంతీయ ముద్రణాలయం అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 30 ఏళ్ల క్రితం దాదాపు రెండెకరాల్లో నిర్మాణాలు ప్రారంభించారన్నా రు. ఇంతవరకు పూర్తి కాలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రధాన ప్రింటింగ్ ప్రెస్ హైదరాబాద్ చంచల్ గూడా జైలు పక్కన ఉండేదని, రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా ప్రింటింగ్ అవసరాలను ఉన్నతాధికారులు గుర్తించలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి వెనకబడిన రాయలసీమలోని కర్నూలులో ప్రాంతీయ ముద్రణాలయం భవనాన్ని పూర్తి చేయాలన్నారు. కొత్త టెక్నాలజీ తో పాటు కావాల్సిన ఉద్యోగులను నియమించాలని, ముద్రణాలయ కార్యాలయంలో సూపరింటెండెంట్ వీర మద్దయ్యకు పిపిఎస్ఎస్ బృందం వినతిపత్రం ఇచ్చారు. మీ వినతి పత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. సీనియర్ నాయకులు ఎస్.సర్వేశ్వర్ రెడ్డి, అన్వర్‌బాష, ఎన్.మద్దిలేటి, కె.శ్రీనివాసులు, ఎల్.నయూమ్, ఎస్.షాహిద్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాష్ట్ర మంత్రులను కలిసిన కర్నూలు ఎంపి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు బుధవారం విజయవాడలో పలువురు రాష్ట్ర మంత్రులను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, మత్స్యశాఖల మంత్రి అచ్చెన్నాయుడు, మున్సిపల్, పట్టణాభివద్ధి శాఖ మంత్రి నారాయణ , గనులు భూగర్భ వనరులు , ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్రలను సచివాలయంలో ని వారి కార్యాలయాల్లో కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సమస్యలపై మంత్రులతో చర్చించారు. జిల్లా అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ఎంపి మంత్రులను కోరారు.

6వ తరగతి ప్రవేశ పరీక్ష తేదీల్లో మార్పు

ప్రజాశక్తి-మద్దికేర

ఎపీ మోడల్ స్కూలులో ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలు నిర్వహించబోయే తేదీలలో మార్పు జరిగినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సవిత తెలిపారు. గతంలో ఈనెల 20 తేది నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 20వ తేదీ ఈస్టర్ పండుగ అయినందున 21వ తేదీ సోమవారం 10 గంటల నుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసిన విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ తో పాటు రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు , ఆధార్ కార్డు ను తీసుకురావాలని కోరారు.

కోడుమూరు ఎస్ఐగా ఎర్రిస్వామి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కోడుమూరు పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా డి.ఎర్రిస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు విఆర్‌లో ఉన్న ఆయనను కోడుమూరు ఎస్ఐగా నియమిస్తూ ఇటీవల ఉన్నట్టు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం వంటి తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ ఎపి శ్రీనివాసులు కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

సి బెళగల్ ఎస్ఐగా పరమేష్ నాయక్

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా పరమేష్ నాయక్ బుధవారం బదిలీ అయిన ఎస్ఐ తిమ్మారెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఎస్ తిమ్మారెడ్డికర్నూల్ -1 టౌన్‌కు బదిలీ అయ్యారు. ఇందులో భాగంగా విఆర్‌లో పని చేస్తున్న పరమేష్ నాయక్ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆయన బాధ్యతలు స్వీకరించగానే మండలంలోని నాయకులు, కార్యకర్తలు, పలువురు పెద్దలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో, పూలమాలలతో స్వాగతం పలికారు.

ముస్లింలకు టిడిపి మోసం

-వక్స్ చట్ట సవరణతో హక్కులకు విఘాతం -ఢిల్లీ నుంచి గల్లి దాకా వ్యతిరేకత
-బహిరంగంగా టిడిపి సమాధానం చెప్పాలి -మాజీ ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : ముస్లింలకు ఎల్లవేళలా అండగా నిలుస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చినా టిడిపి ప్రభుత్వం వక్స్ బోర్డు సవరణ బిల్లుకు అనుకూల ఓట్లు వేసి ముస్లింలకు టిడిపి తీరని అన్యాయం చేసిందని వైసిపి మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. బుధవారం కర్నూలు వైసిపి కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టంపైనా ప్రతి ఒక్కరి వద్ద చర్చ జరుగుతోందన్నారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముస్లిం సోదరులు బయటకు వచ్చి మాట్లతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారన్నారు. మైనార్టీలకు అన్యాయం జరుగుతుందని చెబుతున్నా టిడిపి నేతలు అర్థం చేసుకోవడం లేదన్నారు. 40 సంవత్సరాల అనుభవం ఉన్న పార్టీ, పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఎందుకు అర్థం చేసుకోవడం లేదన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిం దన్నారు. వక్ఫ్ బోర్డులో ఉన్న ఆస్తులు ముస్లిం మైనారిటీలు కాపాడు కుంటూ వస్తున్నారన్నారు. వక్ఫ్ బోర్డు కొత్త చట్టంతో ముస్లిం హక్కులను కలెక్టర్ చేతిలో పెట్టాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. దేశంలో రాష్ట్రంలో మైనార్టీలు అత్యంత వెనుకబడి ఉన్నారన్నారు. ఢిల్లీ నుండి గల్లీ దాకా వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని ముస్లింలు, ముస్లిం సంస్థలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. 200 పైగా ఎంపీలు వ్యతిరేకించి ఓటు వేశారన్నారు. 20 నుండి 30 మంది పార్లమెంటులో వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. దీనిపై టిడిపి నేతలు స్పందించడం లేదన్నారు. ముస్లిం సోదరుల హక్కులను కాల రాసేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. బిల్లుకు టిడిపి ఓటు వేసి వైసిపి పై బురద చల్లేందుకు ప్రయత్నాలు చేసిందన్నారు. వైసిపి ఎంపిలు ప్రశ్నించి, వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. టిడిపి పార్టీ నమ్మిన ముస్లిం సోదరులను టిడిపి కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ మోసం చేసిందన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం పై ముస్లిం సోదరులు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ర్యాలీలు చేస్తున్నారని, దీనిపై ముస్లిం సోదరులకు మద్దుతు ఇవ్వాలని, లేదంటే నారా లోకేష్, చంద్రబాబు నాయుడు సమాధానం చెప్పా లన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం పై వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో సుప్రీంకోర్టులో దావా వేశామన్నారు.కొత్త చట్టంలో ముస్లింలకు ఇబ్బందులు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. బిజెపి పార్టీకి తొత్తులుగా టిడిపి నేతలు వ్యహరిస్తున్నా రన్నారు. ముస్లిం సోదరులకు అండగా నిలబడిన వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. వైసిపిగా సుప్రీం కోర్టు లో పిటిషన్ వేశామని, ఇందులో తమకు కూడా హక్కు కల్పించినవైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. టిడిపికి నిబద్దత ఉంటే వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా కోర్టులో కేసు వేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ముస్లింల ఓట్లు వద్దని చెప్పిందని, టిడిపి కూడా బహిరంగంగా సమాధానం ఇవ్వాలన్నారు.

అనాథ ఆశ్రమంలో అపరిశుభ్రతపై జడ్జి ఆగ్రహం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు అనాథ ఆశ్రమంలో అపరిశుభ్రతపై జస్టిస్ శీలా వెంకట శేషాద్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సాయి అనాథ ఆశ్రమాన్ని తనిఖీ చేశారు. ఆయనతోపాటు ఎల్ఎస్‌యుఎం కమిటీ సభ్యులు శివరాం, డిప్యూటీ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు రాయపాటి శ్రీనివాసులు, పారా లీగల్ వాలంటీర్లు కలసి బుధవారం కర్నూలు బుధవారపేటలోని సాయి అనాథ ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమంలోనీ నిరాశ్రయులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనాథ ఆశ్రమంలో పరిశీలించడానికి సరైన రికార్డులు లేవని, పరిశుభ్రతను పాటించడం లేదని, అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు, సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోలేదని మందలించారు. ఇక నుంచైనాఅనాథ ఆశ్రమాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఆశ్రమంలోని చిన్నారులో జడ్జి లీలా వెంకట శేషాద్రి

మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

దేశవ్యాప్త సమ్మె మే 20న నిర్వహిస్తున్నామని జయప్రదం చేయాలనిసిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు కార్మికులకు పిలుపు ఇచ్చారు. బుధవారం సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆఫీసు బేరర్స్ సమావేశం కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు. ఎండి అంజిబాబు, నగర కార్యదర్శి సిహెచ్. సాయిబాబా మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతం కంటే మరింత దూకుడును పెంచిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అన్నింటిని ఆదాని వంటి కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అప్పజెప్తు చట్టాలను చేస్తున్నదన్నారు. ప్రయివేటు కంపెనీలలో పని గంటలు పెంచి, వేతనాలు తగ్గించి, పని భద్రత లేకుండా కార్మికులను బానిసలుగా చేసే విధంగా యజమానులకు అనుకూలంగా చట్టాలను చేస్తున్నారన్నారు. స్వాతంత్రానికి ముందుపోరాడిసాధించుకున్నటువంటి లేబరు చట్టాలను మార్పు చేసి వాటిని కుదించి నాలుగు లేబర్ కోడ్లుగా చేశారన్నారు. దీనివలన కార్మికులకు రక్షణ, భద్రతలేకుండా పోతున్నదన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాజిటీ, బోనస్ వంటి సదుపాయాలు ఏవి ఉండవన్నారు. సంఘంపెట్టాలంటే కనీసం వందమంది ఉండాలనే నిబంధనలనుపెట్టి చిన్నసంఘాలను రద్దు చేసే పరిస్థితి ఉందన్నారు. దీనికి వ్యతిరేకంగా కేంద్ర,రాష్ట్ర కార్మిక వర్గం ఐక్యమై పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మే 20న చేయబోయే సమ్మెలో ఉద్యోగ, కార్మిక సంఘాలన్నీ కూడా పెద్ద ఎత్తున వేలాదిమంది పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేసే విధంగా సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సిఐటియు నగర ఆఫీస్ బేరర్స్ కె.ప్రభాకర్, ఎం.వెంకటేశ్వర్లు, కె.సుధాకరప్ప, జి.ఏసు, ఎస్ఎం.డి మహమ్మద్ రఫీ, ఇ.విజయుడు, ఎస్.హుస్సేన్ వలీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు

అగ్ని ప్రమాదాలపై నిర్లక్ష్యం వహించొద్దు

అగ్నిమాపక వారోత్సవాల్లో సిబ్బంది ప్రదర్శన

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

అగ్నిమాపక మాపక వారోత్సవాలు సందర్భంగా కోడుమూరు పట్టణంలో మూడవరోజు ఎద్దుల నారాయణరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదాలపై తీసుకునే చర్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తమకు ఫోన్ చేస్తే వెంటనే నిమిషాల్లో మీ ముందు ఉంటామని అగ్నిమాపక శకట సిబ్బంది పేర్కొన్నారు. అపార్టుమెంటులో నివసించు ప్రజలకు, అపార్టుమెంట్ లోని షాప్స్‌లో పనిచేయు సిబ్బందికి వంట ఇంటిలో గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు మొదటగా రెగ్యులేటర్ ఆఫ్ చేయాలని, గ్యాస్ లీక్ అయినప్పుడు కిటికీలు తెరవాలన్నారు. ఎటువంటి విద్యుత్ స్విచ్ ఆఫ్ కానీ ఆన్ కానీ చేయకూడదని, అపార్టుమెంట్లలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు లిఫ్టులను ఉపయోగించకుండా మెట్ల ద్వారా వెళ్ళవలెనని ఇంటి నుండి చాలా కాలము పాటు బయటకి పోయినప్పుడు విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి వెళ్ళవలెనని అక్కడ ఉన్న మహిళలకు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎలా ఆర్పేయాలని ,ప్రయోగపూర్వకంగా చేసి చూపించారు. దీంతోపాటు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఒకటో వార్డు ప్రజలు కోడుమూరు అగ్నిమాపక కేంద్రాధికారి ఎం.మహబూబ్ దౌలత్ సిబ్బంది మరూఫ్, శ్రీనివాసులు, మహేశ్వర్ రెడ్డి, దివాకర్ రెడ్డి, బ్రహ్మేశ్వరరావు, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

తిప్పాయపల్లెలో గ్రామదేవర ఉత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలంలోని తిప్పాయ పల్లె గ్రామంలో బుధ వారం గ్రామదేవర ఉత్స వం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నందికొట్కూరు నియోజకవర్గ ఇన్చార్జి గౌరు వెంకట్ రెడ్డి, నంద్యాల టిడిపి జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి మండల సీనియర్ నాయకుడు సిఎస్.సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ ఉన్న గ్రామస్తులతో స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉత్సవంలో పాల్గొన్న గౌరువెంకట్‌రెడ్డి, ఎం.రాజశేఖర్

వాల్మీకులను ఎస్టీల్లో చేర్చే వరకు ఉద్యమం

- ఎమ్మెల్యే విరుపాక్షి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి- దేవనకొండ

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పార్టీలకతీతంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు పోరాడాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. బుధవారం మండలంలోని గుండ్లకొండ గ్రామంలో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని, దేవనకొండ గ్రామంలో గత రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడిన గొర్రెల కాపరి బోయ లక్ష్మన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం స్థానిక సిఎల్ఆర్సి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక ఏళ్లుగా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించినప్పటికీ పాలక ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇస్తారే తప్ప అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టడం లేదని తెలిపారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామన్న హామీ ప్రకటనలకే పరిమితమైందని చెప్పారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన వాల్మీకుల అభివృద్ధి జరగాలంటే ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగ రంగాల్లో వెనుకబడిన వాల్మీకులు కలిసికట్టుగా ఉద్యమించాలన్నారు. వాల్మీకుల ఎస్టీ జాబితా కోసం తాను దేనికైనా సిద్ధమన్నారు. తమ పంట ఉత్పత్తులను కంపెనీలు కొనడం లేదని పొగాకు సాగు చేసిన రైతులు రైతులు వడ్డే రాజశేఖర్, వెంకటేష్ ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పాలక ప్రభుత్వాలు పొగాకు, మిర్చి రైతులను ఆదుకోవాలని కోరారు. జడ్పిటిసి కిట్టు, వైసిపి మండల నాయకులు కప్పట్రాళ్ల దివాకర్ నాయుడు పాల్గొన్నారు.

23న అంబేద్కర్ జీవిత విశేషాలతో నాటిక

- కరపత్రాలను విడుదల చేసిన తహశీల్దార్ రవి

కరపత్రాలను విడుదల చేస్తున్న తహశీల్దార్ రవి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జీవిత విశేషాలపై ఈనెల 23న ప్రత్యేకంగా నాటిక ప్రదర్శన ఉంటుందని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.ఆనంద్ బాబు తెలిపారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నాటిక ప్రదర్శనకు సంబంధించిన కరపత్రాలను తహశీల్దార్ ఎస్.రవితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక చైతన్యం కోసం అంబేద్కర్ చేసిన కృషి, ఆయన జీవిత చివరాంకంలో 'సంఘం శరణం గచ్ఛామి' అంటూ బౌద్ధమతం స్వీకరించిన తీరును వివరించే విధంగా మండలంలోని మాధవరం గ్రామంలో నాటిక ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 21న పెద్దకడబూరు నుంచి మొదలవుతున్న ఈ జ్ఞానయుద్ధం, 22న కర్నూలు మండలం ఉల్చాల, 23న మంత్రాలయం మండలం మాధవరం, 24న ఎమ్మిగనూరు పట్టణం, 25న ఎమ్మిగనూరు మండలంలో నాటిక ప్రదర్శనలు చేపడుతున్నట్లు తెలిపారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.జయరాజు, మండల కార్యదర్శి జి.అంజి, ఉపాధ్యక్షులు మారెప్ప, సురేష్, నాయకులు ఇజ్రాయేల్, ఎలీషా, దేవా పాల్గొన్నారు.

గర్భిణులకు పోషణ్ పక్వాడపై అవగాహన

ప్రజాశక్తి - ఆదోని

అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సావిత్రి

పట్టణంలోని క్రాంతినగర్ 24వ వార్డులో పోషణ్ పక్వాడపై అవగాహన కల్పించారు. బుధవారం సంత పేట పాఠశాల ప్రాంగణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సావిత్రి మాట్లాడారు. వార్డులో గల మహిళలు, గర్భిణులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పోషకాహారాల విషయంలో అవగాహన అవసరమని తెలిపారు. గర్భం దాల్చిన రోజు నుంచి పుట్టిన పిల్లలు రెండేళ్ల వయస్సు వచ్చేవరకు సంపూర్ణ పోషకాహారాలు అందిస్తే వాటి వల్ల పిల్లల భవిష్యత్తు, ఎదుగుదల ఆధారపడి ఉంటుందని చెప్పారు. అనంతరం గర్భిణులకు సీమంతం జరిపించి పౌష్టికాహారాలు అందజేశారు. మహిళా పోలీసు హైమావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతు, అంగన్వాడీ టీచర్లు శంకరమ్మ, సరస్వతి, రమణమ్మ, సుశి మేరీ, సువార్త పాల్గొన్నారు.

ముగిసిన 'అవిశ్వాసం'

- ఆదోని మున్సిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం సక్సెస్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రశాంతంగా ముగిసింది. వైసిపి కౌన్సిలర్లను అడ్డుకోవాలని ఎమ్మెల్యే పార్థసారథి ఇచ్చిన పిలుపు మేరకు వైసిపి నాయకులు అప్రమత్తమయ్యారు. కౌన్సిలర్లను ఎక్కడా వదలకుండా ప్రత్యేక గదిలో బస చేయించి అక్కడి నుంచే బస్సులో మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. బస్సు ముందు పోలీసులు అక్కడ గట్టి బందోబస్తు నిర్వహించారు. వివరాలన్నీ సేకరించి ఒక్కొక్కరిని మున్సిపల్ కౌన్సిల్ హాలులోకి గుర్తింపు కార్డు ధరించిన కౌన్సిలర్లను లోపలికి పంపారు. ఆదోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం మున్సిపల్ ఛైర్మన్ శాంతపై వైసిపి కౌన్సిలర్లు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం జరిగింది. ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హాజరై కార్యక్రమాన్ని నడిపించారు. ఆదోని మున్సిపాలిటీలో మొత్తం 42 వార్డులు ఉండగా కౌన్సిలర్లలో 34 మంది వైసిపి తరపున హాజరయ్యారు. నాగరత్న ఒకరు స్వతంత్ర అభ్యర్థి కాగా ఆమె కూడా వైసిపికి అనుకూలంగా ఉండడంతో 35 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ కూడా ఓటు హక్కు వినియోగించుకోవడంతో వైసిపికి 36 మంది బలం వెల్లడైంది. వైసిపి గుర్తుపై గెలిచి ఛైర్మన్‌గా కొనసాగిన బోయ శాంత బిజెపి కండువా కప్పుకున్న లలితమ్మ, చిన్న, సురేష్, పద్మావతి, టిడిపి కౌన్సిలర్ పార్వతి, ఎమ్మెల్యే పార్థసారథి గైర్హాజరయ్యారు. హాజరైన సభ్యులంతా అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులెత్తి ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ప్రస్తుత ఛైర్మన్ బోయ శాంతపై పెట్టిన అవిశ్వాస తీర్మానం సక్సెస్ అయింది.

హాజరైన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

అవిశ్వాస తీర్మానం వివరాలు వెల్లడించిన కమిషనర్

మున్సిపాలిటీలో 42 మంది కౌన్సిలర్లు ఉన్నారని, కౌన్సిలర్ రామలక్ష్మమ్మ ఇటీవల చనిపోగా 41 మంది ఉన్నారని తెలిపారు. వైసిపికి 35, రెబల్ ఐదుగురు, ఒకరు టిడిపి కౌన్సిలర్ ఉండగా, ఎమ్మెల్యే పార్థసారథి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ ఓటర్లుగా ఉన్నారని చెప్పారు. వారితో కలిపి ముగ్గురు ఓటర్లు ఉన్నారన్నారు. ప్రస్తుతం వైసిపి కౌన్సిలర్లు 35 మంది, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ ఓటుతో కలిపి 36 మంది అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసి బల నిరూపణ చేశారని తెలిపారు. తీర్మాన పత్రాలను ఎన్నికల కమిషన్ మున్సిపల్ రీజినల్ డైరెక్టర్‌కు పంపుతామన్నారు. పార్టీ గుర్తుపై గెలిచి విప్ జారీ అయి సమావేశానికి హాజరుకాని కౌన్సిలర్లకు రెండు రోజులు సమయం ఇస్తామని, అప్పట్లోగా ప్రిసైడింగ్ ఆఫీసర్, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ముందు హాజరై సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. తదుపరి చర్యలు ఆయన పరిధిలో ఉంటాయని చెప్పారు. పరిపాలన సౌలభ్యం నిమిత్తం ఛైర్మన్‌గా వైస్ ఛైర్మన్లలో ఒకరిని నియమించుకునే అవకాశం ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జీ ఛైర్మన్ నియామకం ఉంటుందని, ఉత్తర్వుల మేరకే ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు.

దుకాణాలు మూయించిన పోలీసులు

మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మాన ప్రక్రియ మొదలుకాక ముందే ఉదయం నుంచే మున్సిపల్ రోడ్డులోని సమీపంలో ఉండే దుకాణాలను పోలీసులు మూయించారు. ఒకే పార్టీకి చెందిన కౌన్సిలర్లు సమావేశానికి హాజరవుతున్నప్పటికీ ఏవైనా అవాంఛనీయ ఘటనలూ జరగవచ్చని పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ప్రధాన గేటులోనే కౌన్సిలర్లు, మీడియా వారిని మాత్రమే కార్యాలయం వద్దకు పంపారు. కౌన్సిల్ హాలులోకి మాత్రం మీడియాకు అనుమతి ఇవ్వకుండా కేవలం సభ్యులకు మాత్రమే కల్పించారు. పోలీసులు బలవంతంగా దుకాణాలను మూయించడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. టెన్షన్ వాతావరణం లేనప్పటికీ అత్యుత్సాహం ప్రదర్శించారని కొందరు పోలీసుల తీరుపై మండిపడ్డారు. కేవలం వైన్ షాప్ మాత్రమే తెరచుకునేందుకు అనుమతి ఇవ్వడం ఏమిటని పలువురు నిలదీశారు. డీఎస్పీ హేమలత, సిఐలు రాజశేఖర్ రెడ్డి, శ్రీరామ్, రామలింగప్ప, గంటా సుబ్బారావు పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తి ఆమోదం తెలుపుతున్న వైసిపి కౌన్సిలర్లు

విద్యార్థికి అరుదైన పురస్కారం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని విద్యార్థి ఐజాక్ న్యూటన్ అరుదైన పురస్కారం పొందడంతో పలువురు అభినందించారు. విద్యార్థి తండ్రి సుధాకర్ బుధవారం వివరాలు వెల్లడించారు. పట్టణంలోని కిడ్డీస్ గ్లోబల్ రూట్స్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న హెచ్‌బి.ఐజాక్ న్యూటన్ గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకున్నాడని తెలిపారు. డిసెంబర్ 1న విజయవాడలో హల్లేల్ సంగీత పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 1076 మంది ఒకే సమయంలో సంగీత పరికరమైన కీబోర్డు వాయించి గిన్నిస్ రికార్డు నెలకొల్పారని చెప్పారు. తల్లిదండ్రులు హెచ్‌బిడి.సుధాకర్, సురేఖతో కలిసి తమ కుమారుడు పాల్గొన్నాడన్నారు. ఈనెల 14న హైదరాబాద్‌లో హల్లేల్ సంగీత స్థాపకుడు అగస్టీన్ దండింగి చేతుల మీదుగా ఐజాగ్ న్యూటన్ పురస్కారం అందుకున్నాడని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి గిన్నీస్ బుక్ రికార్డులో చోటు సంపాదించడం పట్ల కిడ్డీస్ పాఠశాలల డైరెక్టర్లు కేశవ నారాయణ రెడ్డి, చిన్నప్ప రెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ ఐజాక్ న్యూటన్‌ను అభినందించారు. మరింత పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రతిభ చాటిన పేద విద్యార్థులను ప్రోత్సహిస్తాం

- ఇంటర్ విద్యార్థి ప్రవీణ్ కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు సహకారం అందిస్తామని ఎమ్మిగనూరు శ్రీమల్లికార్జున ఆర్థో హాస్పిటల్ డాక్టర్ మల్లికార్జున తెలిపారు. బుధవారం మల్లికార్జున ఆర్థో హాస్పిటల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసి గ్రూపులో 982 మార్కులు సాధించిన చాకలి ప్రవీణ్ కుమార్‌ను సన్మానించి ప్రోత్సాహక బహుమతి ఇచ్చి జ్ఞాపికను అందజేశారు. ఎపియుడబ్ల్యుజె తాలూకా అధ్యక్షులు బి.శ్రీనివాస నాయుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, పట్టణ అధ్యక్షులు జిబి.పరమేష్, యాపిల్ ల్యాబ్ బీరప్ప, మల్లికార్జున హాస్పటల్ మేనేజర్ బోడబొండ కె.నరసింహులు, ఎపియుడబ్ల్యుజె నాయకులు చాకలి నాగరాజు, జాలవాడి బాషా, వి.రామకృష్ణ, ఎం.ఈరన్న, గాజుల వెంకటేష్, నాగభూషణం, సి.ఈరన్న, రాజు, హరి, ఎర్రన్న, బనవాసి అబ్రహాం పాల్గొన్నారు.

సన్మానం చేస్తున్న డాక్టర్ మల్లికార్జున

మాజీ ఎమ్మెల్యే లోకనాథ్ మృతి

- హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి

ప్రజాశక్తి- ఆలూరు

ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే మొలగవల్లి గుడ్లన్నగారి లోకనాథ్ (75) మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు సోదరుడు మొలగవల్లి సర్పంచి మోహన్ రాజ్ బుధవారం తెలిపారు. ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో గుడ్లన్న గారి దేవప్ప, నాగమ్మకు జన్మించిన లోకనాథ్ గ్రామంలో పదో తరగతి వరకు చదువుకున్నారు. 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి నుంచి మొలగవల్లి గ్రామానికి చెందిన రంగయ్యకు టికెట్ ఇవ్వగా అదే గ్రామానికి చెందిన లోకనాథ్‌కు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చిన లోకనాథ్ ప్రత్యర్థి రంగయ్యపై 8,550 ఓట్లతో విజయం సాధించారు. అలాగే టిటిడి డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం రాజకీయాలకు దూరంగా ఉంటూ మరణించే వరకు కాంగ్రెస్‌ను నమ్ముకొని బతికారు. లోకనాథ్‌కు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. కుమారులు సాఫ్ట్‌వేర్, ఇతర ప్రయివేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లోకనాథ్ మృతికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సంతాపం తెలిపారు. చిన్ననాటి స్నేహితులమని, తమ పరిచయాన్ని గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే విరుపాక్షి, బూర్ల రామాంజనేయులు, మాజీ మంత్రి మారెప్ప, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, మాజీ ఎమ్మెల్సీ మసాల పద్మజ, మాజీ ఎంపిపి బిల్లేకల్ వెంకటేష్, సిపిఎం నాయకులు పి.హనుమంతు, కెపి.నారాయణ స్వామి, దొరబాబు, గ్రామస్తులు, పెద్దలు లక్ష్మిరెడ్డి, రామనాథ్ యాదవ్, ఎంపిటిసి బంగారి పటేల్ యాదవ్, అశోక్ యాదవ్, శీనప్ప, గోపాల్, అంజినయ్య, మల్లయ్య, శ్రీరాములు, చంద్ర, వార్డు సభ్యులు హుస్సేన్, జలందర్, ఐకాంత్, పంచాయతీ కార్యదర్శి వెంకట నాయుడు సంతాపం తెలిపారు.

సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలి

- మాజీ ఎంపిటిసి సంగాల భాస్కర్

ప్రజాశక్తి - చిప్పగిరి

నేమకల్లు గ్రామం నుంచి మజారా గ్రామమైన సంగాలకు వెళ్లే రహదారి చాలా అధ్వానంగా ఉందని, ఆ రహదారికి సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని మాజీ ఎంపిటిసి సంగాల భాస్కర్ కోరారు. బుధవారం ఆలూరులో జరిగిన ప్రజా పరిష్కార వేదికలో టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడారు. వర్షాకాలంలో వర్షం వచ్చినప్పుడు రహదారిలో నడవడానికి కూడా చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని, వృద్ధులు, మహిళలు వెళ్లలేని స్థితి ఏర్పడుతోందని తెలిపారు. సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. గ్రామ ఇబ్బందులు తనకు ఇంతకుముందే తెలుసని, అధికారులకు ఆ సమస్యను గత రెండు నెలలు క్రితమే తెలిపామని, త్వరలోనే సిసి రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ తెలిపారు. బాలరాజు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని వీరభద్ర గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న సంగాల భాస్కర్

అభివృద్ధిని చూసి టిడిపిలో చేరికలు : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధిని చూసి వైసిపి నాయకులు టిడిపిలో చేరుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే స్వగృహంలో వైసిపికి చెందిన మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గట్టు హసీనా, గట్టు ఖాజా, తెలుగు రాముడు, సురేష్ చౌదరి, మోనే శ్రీరాములు, మాల రాజేష్, మాజీ కౌన్సిలర్ లచ్చన్న, రవి, నరేష్, కదిరికోట అనిల్ కుమార్, మర మోహన్‌తోపాటు వారి అనుచరులు దాదాపు 2 వేల మంది టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ... ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నామని తెలిపారు. నమ్ముకున్న వారికి న్యాయం జరగాలంటే ఒక్క బీవీ కుటుంబంతోనే సాధ్యమని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచేందుకు పార్టీలోకి వచ్చిన వారికి అభినందనలు తెలిపారు. ఎమ్మిగనూరు అభివృద్ధిని తన తండ్రి బీవీ.మోహన్ రెడ్డి చేసిన దానికంటే మరింత చేసి తీరుతానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ బీవీని భారీ గజమాలతో సన్మానించారు.

టిడిపిలో ఎమ్మెల్యే బీవీ సమక్షంలో చేరుతున్న మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఓ వరం : ఎమ్మెల్యే బీవీ

పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఓ వరమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 15 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే నివాసంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.28,73,739 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో నియోజకవర్గంలో 32 మంది పేదలకు వైద్య సేవల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.50 లక్షల చెక్కులు అందించినట్లు తెలిపారు.

మహారాజశ్రీ డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్
నంద్యాల
డిస్ప్యూట్ నెం. 29/2024
మెస్సర్స్ శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్
నంద్యాల బ్రాంచి. ...డిస్ప్యూటెంట్
వర్సెస్
Molla Khaja Hussain మరియు 2 ఇతరులు.
...అపొనెంట్స్
అపొనెంట్స్ 1 నుండి 3 గురికి నోటీసులు
1) Molla Khaja Hussain S/o M.Minnala Hussain School Assistan NRM Governament High School, Bollavaram Village, Kallur Mandal, Kurnool District.
2) M.Heena Farheen D/o M.Khaja Hussain Mahila Police Grama Sachivalyam, Lakshmi Nagar Panchayathi, Veldurthi Town and Mandal, Kurnool District.
3) K.Fazul Saheb S/o Narasoji, School Assistant, MPUP School, Basthipadu Village, Kalluru Mandal, Kurnool Distrct. ...అపొనెంట్స్
డిస్ప్యూట్ బాకీమొత్తం రూ. 4,85,400-00 రాబట్టుకొనుటకుగాను మీపైన దాఖలు చేసిన డిస్ప్యూట్‌లో 1 నుండి 2వ అపొనెంట్స్ అయిన మీరు 02-05-2025వ తేది రోజున ఉదయం 11:00 గంటలకు మీరుకాని మీ తరపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్ దావా కేసు మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా : 02-05-2025
బై ఆర్డర్ ఆఫ్ ది డిప్యూటి రిజిస్ట్రార్
ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, నంద్యాల

మహారాజశ్రీ డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్
కర్నూలు
డిస్ప్యూట్ నెంబరు 31/2024
మెస్సర్స్ శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్
కర్నూలు బ్రాంచి .... డిస్ప్యూటెంట్
వర్సెస్
K. Manoj Kumar మరియు 4 ఇతరులు.
...అపొనెంట్స్
అపొనెంట్స్ 1 నుండి 5 గురికి నోటీసులు
1. K. Manoj Kumar, S/o. K. Johnson, Police Constable, A.P. Special Party. Holagunda, Kurnool District.
2. G. Madhu, S/o. G. Maddilety, Police Constable, District Armed Reserved department, Kurnool District.
3. K. Mani Kumar, S/o. K. Johnson, Police Constable, A.P. Specialy Party, Dornipadu Village & Mandal, Kurnool District.
4. S. Lokeswara Reddy, S/o. S. Kesava Reddy, Police Constable District Armed Reserved department, Kurnool District.
5. R. Raja Madhu, S/o. R. Chalapathi, Police Constable, District Armed Reserved Department Kurnool District.
...అపొనెంట్స్
డిస్ప్యూట్ బాకీమొత్తం రూ. 3,19,988-00 రాబట్టుకొనుటకు గాను మీపైన దాఖలు చేసిన డిస్ప్యూట్‌లో 1 నుండి 5వ అపొనెంట్స్ అయిన మీరు 02-05-2025వ తేది రోజున ఉదయం 11-00 గంటలకు మీరుకాని మీ తరపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్ దావా కేసు మీపరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా : 02-05-2025
బై ఆర్డర్ ఆఫ్ ది డిప్యూటి రిజిస్ట్రార్
ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, కర్నూలు.

పత్తి అ'ధర'హో..!

రైటప్: ఆదోని మార్కెట్ యాడికి వచ్చిన పత్తి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు భారీగా పెరిగాయి. క్వింటా పత్తి గరిష్టంగా రూ.8,042లకు చేరింది. ఈ సీజన్‌లో ఇదే రికార్డు స్థాయి ధర. పత్తి ధరలు మళ్లీ పుంజుకోవడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 90 శాతానికి పైగా చిన్న, సన్నకారు రైతులు ఇప్పటికే వచ్చిన ధరకు అమ్ముకున్నారు. గత వారంతో పోల్చితే పత్తి ధర క్వింటాకు రూ.200పైగా పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో దూది పత్తి గింజల ధరలు పెరగడంతో స్థానిక మార్కెట్‌లో పత్తి ధరలు పెరిగాయని కాటన్ మర్చెంట్ అసోసియేషన్ నాయకులు బుధవారం తెలిపారు. 515 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా కనిష్ట ధర రూ.4721, గరిష్ట ధర రూ.8,042, మధ్య ధర రూ.7676 పలికింది.

డిప్యూటీ ఎంపిడిఒలుగా గుర్తింపుపై హర్షం

ప్రజాశక్తి - నందవరం

ఇఒఆర్‌డిలను డిప్యూటీ ఎంపిడిఒలుగా ప్రభుత్వం గుర్తించడం సంతోషకరమని ఇఒఆర్‌డి సందీప్ తెలిపారు. ప్రభుత్వ పెద్దలకు, పంచాయతీ రాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజకు ధన్యవాదాలు తెలిపారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్రంలో అతిపెద్ద శాఖ పంచాయతీరాజ్ అని, అందులో ఇఒఆర్‌డిల పాత్ర చాలా కీలకమైందని తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. తమ పని భారాన్ని గుర్తించాలని ప్రభుత్వాలతో గత 20 ఏళ్లుగా పోరాడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం పోరాటాలను, పని భారాన్ని గుర్తించిందని చెప్పారు. పంచాయతీల విస్తరణ అధికారి పోస్టును డిప్యూటీ ఎంపిడిఒగా మార్పు చేస్తు ఎంపిడిఒ పదోన్నతిలో 60 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జిఒ 35ను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఇస్వీ పోలీసు స్టేషన్ ఎస్ఐగా డాక్టర్ నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు టౌన్ పోలీసు స్టేషన్ నుంచి ఆయన బదిలీపై ఇస్వీ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్ఐ నాగేంద్ర కర్నూలు మహిళ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఎస్ఐ నాయక్ మాట్లాడుతూ... శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని తెలిపారు. చోరీలు, జూదం, పేకాట, మట్కా వంటి నేరాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. అనంతరం సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పోలీసు స్టేషన్‌లో సిబ్బంది తనకు సహకరించాలని కోరారు.

మొక్కజొన్న పంట పరిశీలన

ప్రజాశక్తి - మంత్రాలయం

మొక్కజొన్న పంట దిగుబడి గురించి శాస్త్రవేత్తలు మండలంలో పర్యటించి రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బుధవారం మండలంలోని మాలపల్లి గ్రామ సరిహద్దుల్లో గల రైతు పరమేష్ నాయక్ పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నంద్యాల ఆర్ఎఆర్ఎస్ ప్రిన్సిపల్, శాస్త్రవేత్త డాక్టర్ ఎ.రామకృష్ణారావు, సీనియర్ శాస్త్రవేత్త, ప్లాంట్ బ్రీడింగ్ ఆర్ఎఆర్ఎస్ నంద్యాల డాక్టర్ ఈ.వెంకట రమణ, కర్నూలులోని డిఎఎటి సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుజాతమ్మతో కలిసి సందర్శించారు. క్షేత్రస్థాయిలో మొక్కజొన్న పంటలను నమోదు చేసుకుని పంటల దిగుబడికి, సాగులో రైతుల అనుభవంపై చర్చించారు. ఎఒ జీరా గణేష్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

- టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి -ఆలూరు

రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ తెలిపారు. బుధవారం వ్యవసాయ కార్యాలయంలో రైతులకు రాయితీ స్ప్రేయర్ల (మందు పిచికారి పంపు)ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాయితీ యంత్ర పరికరాలను రైతులకు అందించేందుకు రూ.80 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. ఎడిఎ సునీత, ఎఒ వెంకటేష్ గౌడ్, మండల కన్వీనర్ అశోక్ యాదవ్, ఏబీసీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ కిష్టప్ప, ఆగ్రో ఎంటర్‌ప్రైజెస్ ఎమ్.డి.దేవరాజ్, టిడిపి జిల్లా నాయకులు నరసప్ప, సురేందర్ నాయుడు, సోమశేఖర్ నాయుడు, కేశన్న, రామ్ నాథ్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రోగ్రెస్ కార్డులను చూపుతున్న ఎంఇఒ

నూతన మార్పులకు శ్రీకారం

- ఎంఇఒ- 2 నీలకంఠ

ప్రజాశక్తి - గోనెగండ్ల

నూతన విద్యా సంవత్సరానికి (2025-26) సంబంధించి విద్యా వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని గోనెగండ్ల ఎంఇఒ-2 నీలకంఠ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ముగిసే నాటికల్లా బడిఈడు పిల్లలందరినీ వంద శాతం బడుల్లో చేర్పించేలా చర్యలు చేపట్టిందని తెలిపారు.

పాఠశాలలకు నిధులు మంజూరు : మనబడి- మన భవిష్యత్తు కార్యక్రమం కింద 70 శాతం పనులు పూర్తయిన పాఠశాలలను గుర్తించి నిధులు విడుదల చేసిందన్నారు. కులుమాల, వెముగోడు, కున్నూరు, ఎర్రబాడు, చిన్నమరీవీడు పాఠశాలలు మే 28లోపు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశించినట్లు తెలిపారు.

పాఠశాలల్లో మార్పులు : మండలంలోని పాఠశాలల్లో నూతన మార్పుల్లో భాగంగా మోడల్ ప్రైమరీ పాఠశాలలు-38, బేసిక్ ప్రైమరీ పాఠశాలలు-6, ఫౌండేషన్ స్కూలు-1, యుపి స్కూల్-2, జడ్పి హైస్కూళ్లు -13గా మార్పు చేసినట్లు వివరించారు.

21 నుంచి 23 వరకు ప్రత్యేక కార్యక్రమాలు : బడి ఈడు పిల్లలందరినీ విద్యాహక్కు చట్టంలో భాగంగా తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రభుత్వం ఈనెల 21 నుంచి 23 వరకు వంద శాతం అడ్మిషన్లు చేయాలని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అంగన్వాడీ పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతిలో చేర్చడం, 5వ తరగతి పూర్తి చేసిన వారిని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దగ్గరుండి చేర్పించాలన్నారు. ఈనెల 23న తల్లిదండ్రుల కమిటీల సమావేశం నిర్వహించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను ప్రభుత్వం అందజేసిన నూతన ప్రోగ్రెస్ కార్డుల్లో పొందుపరచి తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలకు అందజేయాలన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న విరుపాక్షి రెడ్డి

ఉపాధి వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం : వైసిపి

ప్రజాశక్తి - నందవరం

ఉపాధి వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వంలో చలనం లేదని వైసిపి బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరుపాక్షి రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఉపాధి హామీ చట్టం కింద పనిచేసిన వేలాది మంది కూలీలు గత మూడు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎండలను సైతం లెక్క చేయకుండా రోజూ పనులకు హాజరవుతున్నారని, పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు కేవలం ఈ ఉపాధి పనులపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. చేసిన పనులకు ఇప్పటి వరకు వేతనాలు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వేతనాలు రాకపోవడంతో పేదలు కుటుంబాన్ని పోషించలేని స్థితిలో జీవనం గడుపుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఉపాధి కూలీలతో కలిసి భారీ ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. మండల ఉపాధ్యక్షుడు రాఘవరెడ్డి, సోమశేఖర్ రెడ్డి, తారక రాముడు, రాజు పాల్గొన్నారు.

అదనపు ట్యాంకు మంజూరు చేయండి : టిడిపి

ప్రజాశక్తి - హొళగుంద

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హొళగుంద గ్రామస్తుల తాగునీటి ఎద్దడి నివారణ కోసం అదనపు ఒహెచ్ఎస్ఆర్ ట్యాంక్ మంజూరు చేయాలని టిడిపి సీనియర్ నాయకులు గాలి వీరభద్ర గౌడ్ కోరారు. బుధవారం టిడిపి ఇన్‌ఛార్జీ బి.వీరభద్ర గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అలాగే గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని, గ్రామాభివృద్ధికి ఎక్కువ నిధులు కేటాయించాలని కోరారు. టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కొనియాడారు. గ్రామాభివద్ధికి వీరభద్ర గౌడ్, టిడిపి యువ నాయకులు గిరి మల్లేష్ గౌడ్ సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు సాయిబేష్ పాల్గొన్నారు.

21న 'మోడల్' 6వ తరగతి ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి- ఆలూరు

ఆలూరు ఎపి మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 21న పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.రాఘవ రావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతి ప్రవేశపరీక్ష రాసే విద్యార్థులకు తమ పాఠశాలలో ఈనెల 17న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థులు మే 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని అన్నారు.

పిడుగుపాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - చిప్పగిరి

పిడుగుపడి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని ఏరూరు గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని ఏరూరు గ్రామంలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దినసరి కూలీగా మిరపకాయలు తెంపడానికి వెళ్లిన రజియాబీ (45) ఇంటికి వస్తున్న సమయంలో సచివాలయం సమీపంలో పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామానికి చెందిన రైతులు తెలిపారు. మృతురాలికి భర్త హస్సేన్, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఎకరా పొలం కూడా లేదు. రోజూ కూలి పనికి వెళితే తప్ప జీవనం సాగదని గ్రామస్తులు తెలిపారు. విషయం తెలియగానే తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, స్థానిక వీఆర్ఒ వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు రజియాబీ కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచి వెంకటలక్ష్మి, సాగునీటి సంఘం అధ్యక్షులు ధనంజయ, సేనాపతి, గ్రామ పెద్దలు కోరారు.

అప్పుల బాధతో కూలీ మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కురువ పెద్దయ్య (65) అప్పుల బాధతో మృతి చెందినట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. కురువ వీరనాగమ్మ, కురువ పెద్దయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపారు. వారికి పెళ్లిళ్లు చేసి బాధ్యతలు నెరవేర్చుకున్న ఆయనకు పక్షవాతం సోకి కాలు చేయి పడిపోయిందని, వైద్య ఖర్చులకు, సంతానం వివాహాలకు సుమారు 15 లక్షలు అప్పు అయిందని చెప్పారు. దాన్ని ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై ఇంట్లో వారు కూలీ పనులకు వెళ్లగా బాత్ రూమ్‌లోని యాసిడ్ తాగారని తెలిపారు. విషయం తెలిసిన పొరుగు వారు భార్య, కుమారులకు సమాచారం ఇవ్వగా 108 అంబులెన్స్ ద్వారా ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారని చెప్పారు. మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.